ప్రజాశక్తి
గురువారం 30 మార్చి 2023 5
శ్రీకాకుళం



'వంశధార' ఆధునికీకరణ లేనట్లేనా?

- రూ.834 కోట్లతో వంశధార ఎల్‌ఎంసికి ప్రతిపాదనలు
- ఆర్‌ఎంసి లైనింగ్ పనులకు రూ.18.35 కోట్లు
- బడ్జెట్‌లో నిధులు కేటాయించని ప్రభుత్వం

వంశధార కాలువల ఆధునికీకరణ పనుల కోసం ఎదురుచూపులే మిగిలాయి. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆధునికీకరణ పనుల కోసం 2021-22లో ప్రతిపాదనలు పంపారు. పనులకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందేమోనని ఎదురుచూశారు. కనీసం ఇటీవల బడ్జెట్‌లోనైనా కేటాయింపులు ఉంటాయని చూసినా ప్రభుత్వం నిరాశనే మిగిల్చింది. వంశధార సర్కిల్‌లో ఉన్న ప్రాజెక్టులకు అధికారులు పంపిన ప్రతిపాదనల్లో నాలుగో వంతు మాత్రమే విడుదల చేసింది. అందులో వంశధార ఆధునికీకరణ పనుల ప్రస్తావనే లేదు. కుడి, ఎడమ కాలువలు బలహీనంగా ఉండడంతో పూర్తిస్థాయిలో నీటిని విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతి ఏడాది శివారు భూములకు సాగునీరందని పరిస్థితి తలెత్తుతోంది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం మండలంలోని గొట్టాబ్యారేజీ నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎడమ వైపు కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. 2,480 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువల నిర్వహణ లేకపోవడం, గట్లు బలహీనంగా ఉండడంతో అంతకుమించి నీటిని వదిలితే గండి కొట్టే ప్రమాదమూ లేకపోలేదు. కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో ప్రతి సంవత్సరం పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతున్నాయి. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. క్షేత్రస్థాయి పరిస్థితులను గుర్తించిన ఇంజినీరింగ్ అధికారులు ఎడమ కాలువను ఆధునీకరించాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఆధునికీకరణ పనులకు రూ.834 కోట్లు అవసరమని 2021-22 కొత్త ఎస్ఎస్ఆర్ (షెడ్యూల్ స్టాండర్డ్ రేట్స్)తో నివేదికను గతేడాది పంపారు. ఏడాది గడిచినా ఇప్పటివరకు ప్రభుత్వం ఆమోదం తెలపలేదు. దీంతో అంచనా వ్యయం పెరగడంతో మరోసారి అధికారులు 2022-23 సంవత్సరపు ఎస్ఎస్ఆర్ రేట్లతో అంచనాలు రూపొందిస్తున్నారు.



కుడి ప్రధాన కాలువదీ అదే దుస్థితి

గొట్టాబ్యారేజీ కుడి కాలువ ప్రధాన కాలువదీ అదే దుస్థితి. కాలువ గట్లు కోతకు గురయ్యే ప్రాంతంలో సిసి లైనింగ్ పనుల కోసం 2021-22లో రూ.18.45 కోట్లతో అంచనాలు రూపొందించి పరిపాలనా ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపారు. ఏడాది గడచినా ప్రభుత్వం నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో 2022-23 రేట్లతో కొత్త ఎస్ఎస్ఆర్‌తో అంచనాలను తయారు చేస్తున్నారు.

రెండు పర్యాయాలు కోతకు గురైన గట్లు

వంశధార కాలువలు, గొట్టా బ్యారేజీ ప్రాంతం ఎంత బలహీనమో సంవత్సరం వ్యవధిలో రెండు సందర్భాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు ఉదాహరణ. గత నెలలో వంశధారలో 80 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువ కుడివైపు గట్టు కోతకు గురైంది. గట్టును రూ.13.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపడుతున్నారు. హిరమండలం అక్కరాపల్లి గతేడాది జులైలో అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. దాన్నీ రూ.ఐదు లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువలకు నీరు విడిచిపెడుతున్నారు. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్లు ఎప్పుడు ఏవి కొట్టుకుపోతాయో అన్న పరిస్థితి నెలకొంది.

కొత్త అంచనాలతో ప్రతిపాదనలు



వంశధార కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ పనుల కోసం ప్రభుత్వానికి 2021-22లో ప్రతిపాదనలు పంపాం. ప్రతిపాదనలకు ఇప్పటివరకు క్లియరెన్స్ రాలేదు. ప్రభుత్వ సూచనలతో కొత్త ఎస్ఎస్ఆర్ రేట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపుతాం.

- డోల తిరుమలరావు, వంశధార సర్కిల్ ఎస్ఇ



ఆక్రమణలను అరికట్టాలని జెసి నవీన్‌ను కోరుతున్న టిడిపి నాయకులు

రూ.1500 కోట్ల భూ ఆక్రమణలు

- జెసికి టిడిపి నాయకుల ఫిర్యాదు
- 'ప్రత్యేక స్పందన'కు 135 వినతులు
- ఉజ్జిడిమెట్ట రైతులను అడ్డుకున్న పోలీసులు
- ఆక్రమణలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా : మంత్రి సీదిరి

ప్రజాశక్తి - పలాస

పలాస నియోజకవర్గంలో రూ.1500 కోట్ల విలువైన భూముల ఆక్రమణలు జరిగాయని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, నాయకులు ఫిర్యాదు చేశారు. నియోజకవర్గంలో భూ సమస్యలు, ఆక్రమణలపై మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. రాష్ట్ర పశు సంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ వినతులు స్వీకరించారు. ప్రత్యేక స్పందనకు భూ ఆక్రమణలు, వ్యక్తిగత భూ సమస్యలు, కుటుంబ కలహాలు తదితర వాటికి సంబంధించి 135 వినతులు వచ్చాయి. టిడిపి హయాంలో బిసి భవనం కోసం మంజూరైన భూమి అన్యాక్రాంతమైందని, రూ.కోటి పైబడి చేతులు మారినట్లు టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. పురుషోత్తపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 51-1, 51-2, 51-3లో అనధికార మైనింగ్ చేసి రూ.కోట్ల కంకర కైంకర్యం చేశారని, ఆ స్థలంలో లేఅవ్ట వేశారని తెలిపారు. రామకృష్ణాపురంలో సర్వే నంబరు 143-1లో ఉజ్జిడిమెట్ట సుమారు 30 ఎకరాలు ఆక్రమణకు గురైందని జెసి దృష్టికి తీసుకెళ్లారు. కోసం మున్సిపాలిటీ రెండో వార్డు పరిధిలోని పురుషోత్తపురం సర్వే నంబరు 26లో ఎర్ర కాలువను కబ్జా చేసి నిర్మించిన వాణిజ్య సముదాయాలపై, సర్వే నంబరు 34, 35లో ఎర్ర కాలువను ఎకరా స్థలాన్ని ఆక్రమించుకున్నారని స్థానిక యువకులు ఫిర్యాదు చేశారు. మందసలోని వరాహస్వామి ఆలయ భూమిని ఆక్రమించి దుకాణాలు కట్టారని స్థానికులు జెసి దృష్టికి తీసుకొచ్చారు. మందస బస్టాండ్‌లో సంతోష్ కుమార్ పాణిగ్రాహి అనే వ్యక్తి ఆర్అండ్‌బి స్థలాన్ని ఆక్రమించారని, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకుని బస్టాండ్ కు ఉపయోగించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. బ్రాహ్మణతర్లాలో సర్వే నంబరు 56లో రెండు చెరువులను కప్పేస్తున్నారని ఫిర్యాదు చేశారు. వీటితోపాటు పలు ఫిర్యాదులు వచ్చాయి. చిన్న చిన్న భూ సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదు రావడంతో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల తహశీల్దార్లు ఎల్.మధుసూదనరావు, బి.పాపారావు, బి.అప్పలస్వామిపై జెసి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. స్పందనలో వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.

ఉజ్జిడిమెట్ట రైతులను అడ్డుకున్న పోలీసులు

తమ భూములకు 1బి ఇవ్వాలని కోరుతూ మండలంలోని రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలోని ఉజ్జిడిమెట్ట రైతులు వామపక్ష నాయకులతో కలిసి స్పందనలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. రైతులందరూ వినతిపత్రం ఇచ్చేందుకు కుదరదని, నలుగురు మాత్రమే లోపలకు వెళ్లాలని పోలీసులు స్పష్టం చేశారు. గతంలో తాము ఆందోళన చేపట్టినప్పుడు 1బి ఇస్తామని మంత్రి అప్పలరాజు, తహశీల్దార్ హామీనిచ్చి నెలలు గడుస్తున్నా ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. దీనిపై అందరం కలిసే వినతిపత్రం ఇస్తామని చెప్పడంతో పోలీసులు అందుకు అంగీకరించలేదు. దీంతో ఫిర్యాదు చేయకుండానే రైతులు వెనుదిరిగారు.

భూ ఆక్రమణలు చేసినట్లు నిరూపిస్తే రాజీనామా : సీదిరి

పలాస నియోజకవర్గంలో తాను భూ ఆక్రమణలు చేస్తున్నట్లు ఆరోపణలు చేస్తున్నారని, తాను ఆక్రములు చేసినట్లు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధమని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వ హయాంలో భూ ఆక్రమణలు ఎక్కువగా జరిగాయన్నారు. వాటికి, తనకు ఏమిటి సంబంధమని ప్రశ్నించారు. వైసిపి నాయకులు, తన అనుచరులు ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడినట్లు ఆధారాలతో సహా తన దృష్టికి తీసుకొస్తే వాటిని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో పలాస ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

112 కాల్ చేస్తే ఇంటికి డ్రాప్

- మహిళల కోసం నూతన విధానం
- రాత్రివేళల్లో పోలీసు వాహన సౌకర్యం : ఎస్‌పి రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం క్రైమ్

112 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేస్తే ఒంటరి మహిళలను రాత్రివేళల్లో సురక్షితంగా పోలీసు వాహనాల్లో ఇంటికి డ్రాప్ చేస్తారని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రివేళలో ప్రయాణించి, ఎటువంటి రవాణా సౌకర్యం లేక ఇంటికి చేరుకోలేని ఒంటరి మహిళల కోసం పోలీసు వాహనాల్లో సురక్షితంగా ఇంటికి చేర్చే నైట్ డ్రాప్ టు హోం అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రవేశపెడుతున్నట్లు పేర్కొన్నారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాత్రి 11 గంటల తర్వాత ఇంటికి చేరుకోవడానికి రవాణా సౌకర్యం లేకుంటే అధైర్యపడకుండా 112 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలని తెలిపారు. సంబంధిత పోలీసులు సబ్ డివిజన్ పరిధిలోని దిశ వాహనాలు, పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉన్న వాహనాల ద్వారా పోలీసులు సురక్షితంగా ఇంటికి చేర్చుతారని పేర్కొన్నారు. రాత్రిపూట ప్రయాణం చేసే మహిళలు అపరిచిత వ్యక్తులను నమ్మొద్దని, సమీపంలోని బస్సు, రైల్వేస్టేషన్‌లో ఉన్న పోలీస్ అవుట్‌పోస్టులు, రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఉండాలని సూచించారు. ప్రతి మహిళ తన ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.



మాదకద్రవ్యాల విక్రయాలపై నిఘా

- 14500 టోల్ ఫ్రీ నంబరు ద్వారా ఫిర్యాదుల స్వీకరణ
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో మత్తు పదార్థాలతో పాటు మాదకద్రవ్యాల క్రయ విక్రయాలపై నిఘా పెంచాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదేశించారు. మాదకద్రవ్యాల నిరోధకశాఖ రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్‌పి జి.ఆర్ రాధికతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, మత్తు పదార్థాల నివారణకు నెలవారీ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. జిల్లాలో మాదకద్రవ్యాల వాడకాన్ని పూర్తిగా నిరోధించాలని, ఇందుకోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందించాలని సూచించారు. మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలు, రవాణాపై 14500 టోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. వీటి వాడకం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. వీటి వినియోగాన్ని అరికట్టేందుకు విద్యాసంస్థల్లో టోల్ ఫ్రీ నంబరును, హోర్డింగులు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలన్నారు. మత్తు పదార్థాలను విక్రయించే షాపులపై నిఘా పెట్టాలని ఆదేశించారు. మద్యం షాపుల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మందుల షాపులు, ఇతర ట్రేడర్స్‌తో సమావేశాలు నిర్వహించి చట్టంలోని అంశాలను వివరించాలని చెప్పారు. మైనర్లకు మద్యం, పొగాకు, గంజాయి విక్రయించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. టోల్ ఫ్రీ నంబరు 14500 అందరికీ తెలిసేలా ప్రదర్శించేలా చర్యలు చేపట్టాలని జిల్లా విద్యాశాఖ అధికారి జి.పగడాలమ్మను ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్‌పి బాలరాజు, జిల్లా అటవీశాఖ అధికారి నిశాకుమారి, సెంట్రల్ ఇంటెలిజెన్స్ డిఎస్‌పి కిషోర్, సేల్స్ టాక్స్ అధికారి జి.రాణి మోహన్, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వరరావు, కస్టమ్స్ ప్రైవేంటివ్ అధికారి ప్రవీణ్ కుమార్, ఆర్‌డిఒ బి.శాంతి, వ్యవసాయశాఖ జెడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

అరసవల్లి హుండీ ఆదాయం రూ.50.10 లక్షలు

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ ఆదాయం రూ.50,10,437 లభించింది. ఆలయ ప్రాంగణంలోని అనివెట్టి మండపంలో హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. ఈ ఏడాది ఫిబ్రవరి 14 నుంచి ఈనెల 28వ తేదీ వరకు హుండీలో యాత్రికులు సమర్పించిన కరెన్సీ నోట్లు రూ.48,11,987, చిల్లర నాణేలు రూ.1,98,450 కలిపి మొత్తం రూ.50,10,437 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. వీటితోపాటు 104 గ్రాముల బంగారం, 2.200 కేజీల వెండి, విదేశీ మారక ద్రవ్యం నోట్ల రూపంలో బ్యాంక్ ఆఫ్ నెగరా మలేషియా 1 రింగిట్, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 52 డాలర్లు సమాకూరినట్లు చెప్పారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ సూపరింటెండెంట్ బి.వి.వి.ఆర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, శ్రీకూర్మం ఆలయ ఇఒ జి.గురునాథరావు, పాలకమండలి సభ్యులు ద్వారపు అనురాధ, జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సేవకులు

పశుబీమా డబ్బులు ఏవీ?

- ఎఎబి సమావేశంలో ప్రశ్నించిన సభ్యులు
- వ్యవసాయ యాంత్రీకరణకు చర్యలు
- ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఏడాది కాలంగా మృత్యువాత పడిన పశువులకు బీమా డబ్బులు రావడం లేదని పలువురు సభ్యులు ప్రశ్నించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి (ఎఎబి) సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్ కె.రాజేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ సభ్యులు గొండు రఘురాం మాట్లాడుతూ బీమా డబ్బుల కోసం గ్రామాల్లో రైతులు అడుగుతున్నారని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై పశు సంవర్ధకశాఖ జెడి కిశోర్ మాట్లాడుతూ జిల్లాలో 2,500 పశువులకు రూ.8.91 కోట్లు రావాల్సి ఉందని, వాటిని ఆర్‌బిఐకి పంపామని చెప్పారు. కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ మాట్లాడుతూ క్లస్టర్ హైరింగ్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించి రైతులతో గ్రూపులను ఏర్పాటు చేయడంతో జిల్లా బాగా వెనుకబడి ఉందన్నారు. దీనిపై విఎఎలతో సమీక్షా సమావేశం నిర్వహించి త్వరితగతిన గ్రూపులు ఏర్పాటయ్యేలా చూడాలని వ్యవసాయశాఖ జెడి శ్రీధర్‌కు సూచించారు. నీటి సాంద్రత ఆధారంగా రైతులు వేయాల్సిన పంటలపై అవగాహన కల్పించాలన్నారు. ఎరువుల అవసరాలను గుర్తించి అందుకు తగిన విధంగా సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. సంచార పశువైద్య వాహనాలు తరచూ గ్రామాల్లో పర్యటించి పశువులకు వైద్యం అందజేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ వేగంగా జరిగేలా చూడాలన్నారు. వ్యవసాయ సలహా మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు క్షేత్రస్థాయికి చేరేలా చూడాలని సూచించారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ మాట్లాడుతూ సంచార పశు వైద్యంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన లేకపోవడంతో సరిగా వినియోగించలేకపోతున్నారని చెప్పారు. వంశధార కాలువల పరిస్థితి బాగాలేదని, ఈ ఏడాది వాటి నిర్వహణపై దృష్టిసారించాలని వంశధార ఎస్ఇ డోల తిరుమలరావుకు సూచించారు. వ్యవసాయ సలహా మండలి బోర్డు చైర్మన్ నేతాజీ మాట్లాడుతూ మత్స్యశాఖ అమలు చేస్తున్న పథకాలతో మత్స్యకారులకు మేలు చేకూరుతుందని చెప్పారు. కృషి విజ్ఞాన కేంద్రంలో శిక్షణ పొంది ఎన్.జి రంగా యూనివర్సిటీలో మిల్లెట్స్ 2023 అవార్డు అందుకున్న ఎన్.సుజాత చిరుధాన్యాల వినియోగం వల్ల ఉపయోగాలను వివరించారు. అనంతరం ఆమెకు కృష్ణదాస్, కలెక్టర్ అవార్డు అందజేశారు. సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.వి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాదరావు, పట్టు పరిశ్రమ, మార్కెటింగ్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం క్రైమ్

గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, జిల్లాలో విక్రయాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాలో నమోదైన గంజాయి కేసుల దర్యాప్తు, రహదారి ప్రమాదాల నివారణ, ఆస్తి నేరాల నియంత్రణ చర్యలపై జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గంజాయి పూర్తిస్థాయిలో నిర్మూలనకు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. తరుచూ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న వారిపై నిఘా పెట్టాలని సూచించారు. గంజాయి సంబంధిత కేసుల్లోని నిందితుల ప్రవర్తనలో మార్పు రాకుంటే వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.



జాతీయ రహదారి పొడువునా ప్రమాదాలు సంభవించే ప్రదేశాలను గుర్తించి ప్రమాద, నో పార్కింగ్ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. మలుపులు తిరిగే చోట వేగం నియంత్రించే స్పీడ్ బ్రేకర్స్, స్యాండ్ డ్రమ్స్, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని చెప్పారు. నిరంతరం విజిబుల్ పోలీసింగ్, వాహనాలు తనిఖీలు నిర్వహించాలన్నారు. ఆస్తి నేరాలు జరగకుండా ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గస్తీలు పెంచాలని ఆదేశించారు. పాత కేసుల్లోని నేరస్తులపై నిఘా పెట్టాలని సూచించారు. వ్యాపార సముదాయాలు, బ్యాంకులు, ఎటిఎంల వద్ద సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, ఎస్‌బి డిఎస్‌పి ఎస్.బాలరాజు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

'పది'ంతల పర్యవేక్షణ

- సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- శతశాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక

ప్రజాశక్తి - కవిటి

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక పర్యవేక్షణతో పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు. మండలంలోని 20 ప్రభుత్వ ఉన్నత, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి 986 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే పూర్తిస్థాయి బోధన అందించిన ఉపాధ్యాయులు ఈ నాలుగు రోజులూ విద్యార్థులను పూర్తిస్థాయిలో సన్నద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 128 మంది పదో తరగతి విద్యార్థుల్లో 92 మంది ఆంగ్ల మాధ్యమంలో చదువుతుంటే 36 మంది తెలుగు మాధ్యమం చదువుతున్నారు. వీరికి జనవరి 23 నుంచి మార్చి 21 వరకు ప్రభుత్వం రూపొందించిన డాట్ (డైలీ ఆన్లైన్ టెస్ట్) పరీక్షలు నిర్వహిస్తూ విద్యార్థులకు ఎప్పటికప్పుడు మెరుగులు దిద్దారు. రోజులో ఉన్న ఎనిమిది పీరియడ్స్‌ను నాలుగుగా విభజించి ప్రతిరోజూ నాలుగు డాట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8:30 నుంచి 9.15 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి ఐదు గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. వీటిద్వారా విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. మరోవైపు వెనుకబడిన విద్యార్థులు సైతం ఉత్తీర్ణత సాధించేలా పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 18 మంది ఉపాధ్యాయులు పాఠశాలలోని 128 పదో తరగతి విద్యార్థుల బాధ్యతను తీసుకుని ప్రతిరోజూ వారి విద్యా విషయాలను పర్యవేక్షిస్తున్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడుతూ పిల్లల సమాచారం చేరవేస్తున్నారు. రాత్రివేళల్లో విద్యార్థులు చదువుతున్నదీ, లేనిదీ వారి ఇళ్లకు వెళ్లి తెలుసుకుని తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు కూడా తమ పిల్లల చదువులపై ప్రత్యేక దృష్టిసారించి ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారు.



విద్యార్థులకు నిర్వహిస్తున్న స్టడీ అవర్స్

స్టడీ మెటీరియల్ అందించిన యుటిఎఫ్, చాగంటి ట్రస్ట్

యుటిఎఫ్ అందించిన స్టడీ మెటీరియల్, వైజాగ్ కు చెందిన చాగంటి ట్రస్ట్ అందించిన ఆల్ ఇన్ వన్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నట్టు ఉపాధ్యాయులు తెలిపారు. ముఖ్యంగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే కాకుండా విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌నూ అందించి యుటిఎఫ్ తన ప్రత్యేకతను చాటుకుందని ఉపాధ్యాయులు అన్నారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం



సి, డి గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాం. పరీక్షల ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యాన్ని గుర్తించడమే కాకుండా వారిలోని లోపాలను తెలియజేసి అప్రమత్తం చేశాం. ప్రతి ఉపాధ్యాయుడు కొంతమంది విద్యార్థులను దత్తత తీసుకుని పరీక్షలు పూర్తయ్యే వరకు వారి బాధ్యతలు తీసుకున్నారు. శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా పూర్తిస్థాయిలో విద్యార్థులను సన్నద్ధం చేశాం.

- బెందాళం మల్లేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కవిటి

ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు



ఉపాధ్యాయులు మొదట్నుంచీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠాలు బోధించారు. రాత్రివేళలోనూ మేము ఏ విధంగా చదువుతున్నామనేది వచ్చి చూస్తున్నారు. కచ్చితంగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తాను.

- జె.లావణ్య, తెలుగు మాధ్యమం విద్యార్థి, గొండ్యాలపుట్టుగ


క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

పోలీసులు స్నేహభావంతో మెలగాలి

పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు

ప్రజాశక్తి- పలాస

పోలీసులు స్నేహభావంతో మెలగాలని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని బొడ్డపాడులో ఎస్‌పి జి.ఆర్.రాధిక ఆదేశాల మేరకు కాశీబుగ్గ పోలీసులు ఆధ్వర్యాన బుధవారం జిల్లాస్థాయి వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసుల ఆధ్వర్యాన క్రీడలు పోటీలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఉద్దాన ప్రాంతంలోని విప్లవాలకు పురిటి గెడ్డ బొడ్డపాడులో జిల్లాస్థాయి క్రీడలు నిర్వహించడం ఆసక్తికరంగా ఉందన్నారు. బొడ్డపాడులో నిర్వహించిన క్రీడలు రసవత్తరంగా సాగుతాయన్నారు. ఈ క్రీడల వల్ల క్రీడాకారుల్లో ప్రతిభ బయటపడటంతో పాటు వారి మధ్య స్నేహభావం మెరుగుపడుతుందన్నారు. ముందుగా మంత్రి అప్పలరాజును కాశీబుగ్గ డిఎస్‌పి దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ పోటీల్లో వాలీబాల్ పోటీలకు 18, క్రికెట్‌కు ఆరు, బ్యాడ్మింటన్‌కు ఎనిమిది టీములు పాల్గొన్నాయి. కార్యక్రమంలో కాశీబుగ్గ సిఐ శ్రీనివాసరావు, పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావుచౌదరి, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, సర్పంచ్ తామాడ మధన్, సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న గొండు శంకర్

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బాక్సింగ్‌కు ప్రపంచ స్థాయి గుర్తింపు ఉందని, బాక్సింగ్‌లో ఉన్నతంగా రాణిస్తే ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. భువనేశ్వర్‌లో ఈ నెల 3 నుంచి 10 వరకు నిర్వహించిన ఆలిండియా యూనివర్సిటీ నేషనల్స్‌కు బాక్సింగ్‌లో ఎంపికయ్యారు. ఈ మేరకు నగరంలోని విశాఖ-ఎ కాలనీలోని గొండు శంకర్ కార్యాలయంలో బుధవారం అభినందిస్తూ... ప్రయాణ ఖర్చులకు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఎంతో మంది క్రీడాకారులకు బాక్సింగ్‌లో ఉత్తమంగా శిక్షణ అందిస్తూ వారిని రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దుతున్న ఉమామహేశ్వరరావును అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో జిల్లాలో బాక్సింగ్ క్రీకాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో క్రీడాకారులు బి.తేజ, పి.అప్పలరాజు, మనోజ్‌సింగ్, ఎల్.లోకేష్, ఎల్.అభిరామ్, టీమ్ మేనేజర్ పి.విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- పొందూరు

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చేపట్టనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. పొందూరులో చలో పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు అవలంబిస్తూ కార్మిక, కర్షకులకు ద్రోహం చేస్తున్నారని విమర్శించారు. కార్మిక హక్కులు కాలరాస్తూ పెట్టుబడిదారులకు కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేవిధంగా కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు తెస్తున్నారు. బిజెపి, మోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అధోగతి పాలయ్యిందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు చుక్కలనంటుతున్నాయన్నారు. బియ్యం, పాలు, నూనెలు, పప్పు దినుసులతో సహా అన్ని వస్తువులపైనా జిఎస్‌టి పేరుతో భారం మోపారని అన్నారు. వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.1150 దాటిందన్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లు ఇష్టారాజ్యంగా పెంచి రూ.27 లక్షల కోట్లు భారాలు ప్రజల నెత్తిన రుద్దారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలైన రైల్వే, ఎల్ఐసి, బ్యాంకులు, బిఎస్ఎన్ఎల్‌లను ప్రయివేటీకరించి కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని అన్నారు. అంబానీలు, అదానీలకు పోర్టులు, విమానాశ్రయాలు, టెలికాం, విద్యుత్ ఇలా ఒక్కొక్కటి ధారాదత్తం చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు కనీస వేతనం వేతనం రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ.పది వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు 2022ను తక్షణమే రద్దు చేయాలన్నారు. ఉపాధి కూలీలకు 200 రోజుల పని కల్పించి రోజుకు రూ.600 కూలి ఇవ్వాలన్నారు. పట్టణ ప్రాంతాల్లోని పేదలకు ఉపాధి కూలి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజ్యలక్ష్మి పోల్స్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పేడాడ అప్పలనాయుడు, ఇండేన్ గ్యాస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రాధాకృష్ణ, బి.లక్ష్మీనారాయణ, ఎ.లక్ష్మునాయుడు తదితరులు పాల్గొన్నారు.


శ్రీకాకుళం : ర్యాలీ నిర్వహిస్తున్న బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు


మెళియాపుట్టి : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శ్రీకాకుళం : చలో ఢిల్లీని విజయవంతం చేయాలని బిఎస్ఎన్ఎల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాతల గోవర్ధనరావు, పోలాకి వెంకటరావు పిలుపునిచ్చారు. నగరంలోని సూర్యమహల్ కూడలి వద్ద చలో ఢిల్లీ విజయవంతంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బిఎస్ఎన్ఎల్‌కు 4జి, 5జి సేవలు అందించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఇయు నాయకులు వెంకటరావు, అభిమన్యు, లక్ష్మి అరుణ, శారద, కె.గోపాలరావు, జగన్నాయకులు, ఢిల్లేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: చలో ఢిల్లీలో కార్మికులు, కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా రైతు కార్మిక సంఘం కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సురయ్య పిలుపునిచ్చారు. మండలంలో పరశురాంపురం పంచాయతీ నందవకోత్తురులో పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తెంబూరు ప్రసాదరావు, మాజీ సర్పంచ్ జన్ని రామకృష్ణ, పి.బాలరాజు, కామరాజు, బి.తవిటినాయుడు, చలపతిరావు, ప్రకాష్, చంద్రయ్య, సోమేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.


పొందూరు : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

ఎక్కువ స్థలంలో ఇళ్లు నిర్మిస్తే బిల్లులు చెల్లించరా!

మండల సమావేశంలో సభ్యుల నిలదీత

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

లబ్ధిదారుల సొంత స్థలంలో అధికారులు చెప్పిన కొలతలు కంటే కొద్దిగా ఎక్కువ స్థలంలో ఇళ్ల నిర్మాణాలు చేపడితే ఎందుకు బిల్లులు చెల్లించరని గృహనిర్మాణ శాఖాధికారి రెడ్డి పాపినాయుడును సభ్యులు నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి రోణంకి ఉమామల్లేశ్వరి అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు గృహనిర్మాణశాఖ అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం ఒక కొలత ప్రకారం ఇళ్లు నిర్మించాలని, అంతకుండా ఎక్కువ, తక్కువగా నిర్మించరాదని ఉన్నతాధికారులు ఆదేశించారని అన్నారు. అందుకే ఎక్కువ, తక్కువగా నిర్మించి ఇళ్లకు ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదని స్పష్టం చేశారు. అలాగే అన్‌లైన్‌లో ఇళ్ల పట్టాలు కావాలని పెట్టుకొని నెలలు గడుస్తున్న ఎందుకు ఇవ్వడం లేదని తహశీల్దార్ జామి ఈశ్వరమ్మకు సభ్యులు ప్రశ్నించారు.


మాట్లాడుతున్న ఎంపిపి ఉమామల్లేశ్వరి

అలాగే ఉపాధి హామీ చట్టం ద్వారా పిల్ల కాలువల్లో పనులు నిర్వహించాలని ఎపిఒ జిహరిప్రసాద్‌కు సభ్యులు కోరారు. రైతులకు మేలు రకం విత్తనాలు ఇస్తున్నామని చెప్పటమే కానీ, ప్రభుత్వం అందించిన విత్తనాలు సగం పుట్టడం లేదని ఎంపిటిసి పట్ట సింహాచలం ఎఒ గోవిందరావుకు సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు దుక్క రోజా, మండల విప్ బొడ్డు అప్పన్న, ఎంపిటిసి నంబాళ్ల రాజశేఖర్, సర్పంచ్‌లు బలగ సూర్యారావు, బోనేల యల్లయ్య, పేడాడ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- రణస్థలం

పౌష్టికాహారంతోనే అంగన్వాడీ పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యమని ఐసిడిఎస్ ఎసిడిపిఒ సుగుణ అన్నారు. మండలంలోని చిత్రికిపేట అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిరుధాన్యాలతో కూడిన పౌష్టికాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు, పిల్లలకు గుడ్లు, పాలు, ఆకుకూరలు అందించాలన్నారు. వైఎస్ఆర్ సంపూర్ణ కిట్టు బాలామృతం, గుడ్లు, పాలను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల పిల్లల బరువు, ఎత్తు పెరుగుతాయన్నారు.


పోషకాహార పదార్థాలను ప్రదర్శిస్తున్న కార్యకర్తలు


సైకిల్‌ను అందజేస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

విజేతగా సీతామహాలక్ష్మి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నేషనల్ వాల్యూ ఎడ్యుకేషన్-23 బుధవారం నిర్వహించిన పోటీల్లో జిల్లా టాపర్‌గా న్యూ సెంట్రల్ స్కూల్‌లో ఆరో తరగతి విద్యార్థిని కె.సీతామహాలక్ష్మి నిలిచింది. ఆమెకు పాఠశాలలో ఇస్కాన్ ప్రతినిధులు ప్రథమ బహుమతిగా సైకిల్‌ను అందజేశారు. అలాగే పాఠశాల స్థాయిలో టాపర్లుగా నిలిచిన సాయి ఆదిత్య పట్నాయక్, కె.సాయిచెరిష్, ఎం.నవ్యశ్రీలకు ధ్రువపత్రాలను, బహుమతులను అందజేశారు. అలాగే మరో 28 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బలివాడ మల్లేశ్వరరావు, డైరెక్టర్ పి.శ్రీకాంత్, కో-ఆర్డినేటర్లు డి.వి.ఎన్.పట్నాయక్, ఎం.వెంకటరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

కోటబొమ్మాళి: మండలంలోని దుప్పిలపాడుకు చెందిన అభిప్రియ గ్రానైట్ పరిశ్రమకు చెందిన శ్యామ్‌నారాయణ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనకాపల్లికి చెందిన ఎ.సురేంద్రకుమార్‌పై చిటింగ్‌కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. తమ గ్రానైట్ పరిశ్రమకు రాయిని ఇస్తామని చెప్పి తమ వద్ద దఫదఫలుగా రూ.9 లక్షలు నగదు తీసుకొని రాయిని పంపించలేదని అన్నారు. రాయి పంపించినప్పుడు తమ డబ్బులు తమకు ఇవ్వాలని చెప్పినా ఇవ్వడం లేదని శ్యామ్‌నారాయణ ఫిర్యాదు చేశారని అన్నారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.


డిపోలో నిలిచిన బస్సులు

సాంకేతిక లోపంతో నిలిచిన బస్సులు

ప్రజాశక్తి- పలాస

పలాస ఆర్‌టిసి డిపోలో సాంకేతిక లోపం కారణంగా గంట పాటు బస్సులు నిలిచిపోయాయి. డిపోలో బుధవారం ఉదయం యథావిధిగా బస్సులకు టిమ్స్ యంత్రాలు అందించే పనులు ఉదయం ఐదు గంటలకు చేపడుతున్నారు. ఆ సమయంలో సర్వర్ సాంకేతిక లోపం ఏర్పడడంతో టిమ్స్ యంత్రాలు పనిచేయడం ఆగిపోయాయి. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధమైన డ్రైవర్లకు, కండక్టర్లకు టీమ్స్ యంత్రాలు అందించకపోవడంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ఉదయం 6 గంటల వరకూ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాత టీమ్స్ యంత్రాలు అప్పగించి బస్సులు నడిచే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో అనుకున్న సమయం కంటే ఆలస్యంగా తిరిగాయి.

అట్రాసిటీ కేసులు నీరుగార్చొద్దు

టెక్కలి : ప్రస్తుతం దళితులపై దాడులు పెరుగుతున్నాయని, ఇటువంటి సమయంలో నమోదైన ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులను నీరు గార్చే విధంగా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై ఉద్యమం చేయాల్సి వస్తుందని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు యడ్ల గోపి అన్నారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా దళితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకుల కనుసన్నల్లో అధికారులు తమ విధులు నిర్వర్తించడం వల్ల దళితులకు అన్యాయం జరుగుతుందన్నారు. వీటిపై అధికారులు స్పందించకపోతే బాధితుల పక్షాన పోరాడి ఉద్యమం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.

'సియుటిఎం'లో సదస్సు

ప్రజాశక్తి- పర్లాకిమిడి

గజపతి జిల్లా పర్లాకిమిడి వద్ద ఉన్న సియుటిఎంలో జాతీయ స్థాయి స్టూడెంట్ మేనేజ్‌మెంట్ సదస్సు మంగళ, బుధవారాల్లో ఘనంగా నిర్వహించారు. సియుటిఎం వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ డి.ఎన్.రావు అందరినీ ప్రోత్సహిస్తూ తన సందేశాన్ని అందించారు. డాక్టర్ అనితపాత్ర స్వాగత ప్రసంగం చేశారు. కార్యక్రమంలో పిజిపి కో-ఆర్డినేటర్ డాక్టర్ దేవీప్రసాద్ శతపతి, డైరెక్టర్, అడ్మిన్ డాక్టర్ దుర్గాప్రసాద్ పాడి, మాంజార్-23 కన్వీనర్ డాక్టర్ సుశాంత్ కుమార్ పట్నాయక్, శ్రీకాకుళం ఆదిత్య, సన్, గాయత్రి కళాశాలల, పర్లాకిమిడి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ రెండు రోజుల పాటు విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్లు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 48 మంది ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో వాల్టెక్ ఇంజినీర్స్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీ బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలో 48 మంది ఐతమ్ విద్యార్థులు పలు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. 2023 విద్యా సంవత్సరంలో విడుదలవుతున్న పలు బ్రాంచీలకు చెందిన 25 మంది బిటెక్ విద్యార్థులు ఏడాదికి రూ.2.4 లక్షల ప్యాకేజీతో చెన్నయ్‌లో విధులు నిర్వహించేందుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. అలాగే ఇదే విద్యా సంవత్సంలో విడుదలవుతున్న డిప్లొమోకు చెందిన పలు కోర్సులకు చెందిన 23 మంది విద్యార్థులు వార్షిక వేతనంగా రూ.2.4 లక్షల వేతనంతో ఎంపికయ్యారని డైరెక్టర్ అన్నారు. ఉద్యోగ సంపాదనే లక్ష్యంగా విద్యాసంస్థలో ప్రవేశించిన నాటి నుంచి ప్రణాళికా బద్ధంగా, క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేసిన వారు మంచి ప్యాకేజీతో గొప్ప గొప్ప కంపెనీలకు ఎంపికవుతారన్నారు. వాల్టెక్ ఇంజినీర్స్ ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో కొలువులకు ఎంపికైన విద్యార్థులకు డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఫిన్సింగ్స్కూల్ డీన్ డాక్టర్ డి.విష్ణుమూర్తి, డిప్లొమో డిడి బి.శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ అధికారి డాక్టర్ ఎం.వి.ఎస్.ఎస్.కుమార్, శ్రీకాంత్, కె.సాగర్ అభినందించారు.

'గడప గడప'తో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

గడపగడపతో సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పాలతలగాంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలు తెలుసుకుని తక్షణమే స్పందించి అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు, ఎంపిపి ప్రతినిధి మేరుగు అప్పారావు, వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమారావు, సర్పంచ్ నక్కెట్ల అప్పన్న, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు శ్రీరంగం వీరస్వామి, ఎంపిటిసి ప్రతినిధి అప్పలనాయుడు కార్యదర్శి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

పాత విధానాన్నే కొనసాగించాలి

టెక్కలి: గ్రానైట్ పాలిషింగ్ యునిట్ విధానంలో పర్మిట్లు తీసే విధానంలో పాత విధానాన్నే కొనసాగించాలని గ్రానైట్స్ నియోజకవర్గ పాలిషింగ్ యూనిట్ నాయకులు గోపీచౌదరి కోరారు. స్థానిక మైన్స్ కార్యాలయం ఆవరణలోని కార్యాలయం వద్ద బుధవారం సమావేశం నిర్వహించారు. గతంలో పర్మిట్ తీసే విధానంలో ఆన్‌లైన్ పద్ధతిలో ఎండిఎల్. విధానం ఉండేదని, ఇప్పుడు అది ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించడంతో పాలిషింగ్ యూనిట్లకు అన్యాయం జరుగుతుందని అన్నారు. దీనిపై మైన్స్ అధికారుల వద్ద తమ ఆవేదన విన్నవించుకున్నా... సమస్య పరిష్కారం కావడం లేదని అన్నారు. దీనిపై సంబంధిత అధికారులు దృష్టి సారించి ఎండిఎల్ విధానాన్ని పాత పద్ధతిలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీ ఆదాయానికి గండి


వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజర్ పంచాయతీ ఆదాయానికి బుధవారం నిర్వహించే వేలంపాటలో గండి పడింది. టెక్కలి సర్పంచ్ గొండెలి సుజాత అధ్యక్షతన అశీలు రోజువారీ మార్కెట్ వేలం పాట బుధవారం నిర్వహించారు. ఈ వేలంపాటలో 20 మంది పాటదారులు పాల్గొనగా పంచాయతీ కార్యదర్శి కూన వినోద్‌కుమార్ రూ.9.50 లక్షలకు వేలం పాట ప్రారంభించారు. అయితే పాటదారులు సిండికేట్‌గా ఏర్పడడంతో గతేడాది కంటే ఈ ఏడాది రూ.85 వేలుకు తక్కువగా పాట పాడిన జీరు వెంకటరెడ్డికి అధికారులు ఖరారు చేశారు. అయితే పాట ప్రారంభించన సమయం లో పాటదారులు గొడవ పడి బయటికి వెళ్లి సిండికేట్‌గా ఏర్పడ్డారు. రూ.10.15 లక్షలు కంటే ఎక్కువ పాట పాడకుండా ఉండాలని నిర్ణయించారు. ఒక్కొరికీ రూ.5 వేలు చొప్పున ఇవ్వడానికి ఒప్పందం కుదుర్చుకున్న సమాచారం. అందులో జీరు వెంకటరెడ్డి రూ.10.15 లక్షలకు వేలం పాట పాడడంతో ఆయనకే ఖరారు చేశారు. గతేడాది రూ.11 లక్షలకు పాట పాడగా, ఈ ఏడాది రూ.10.15 లక్షలకు పాట పాడారు. దీంతో రూ.85 వేలు పంచాయతీ ఆదాయానికి గండి పడింది. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కూర్మారావు, వార్డు మెంబరు పీత రమణ, బమ్మిడి గురువునాయుడు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

'ఉపాధి' పనులు కల్పించాలి

ప్రజాశక్తి- కవిటి

ఉపాధి హామీ చట్టంలో భాగంగా తమ గ్రామంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ టి.నారాయణ తనకు చెందిన ఐదుగురు వ్యక్తులను మ్యాట్‌లుగా నియమించుకుని, తనకు సంబంధించిన వారికే ఉపాధి పనులు కేటాయిస్తున్నారని, మిగతా వారికి పనులు కేటాయించడం లేదని లండారిపుట్టుగ గ్రామస్తులు అన్నారు. ఈ మేరకు ఎంపిడిఒ సూర్యనారాయణకు బుధవారం ఫిర్యాదు చేశారు. అనంతరం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో వంద మంది జాబ్‌కార్డు దారులకు ఉపాధి పనులు కేటాయించడం లేదని వాపోయారు. పనులు ఇచ్చిన వారికే మళ్లీ మళ్లీ ఇస్తున్నారని ఆరోపించారు.

దీనిపై స్పందనలో, ఎపిఒ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని వాపోయారు. గ్రామంలో ఉపాధి హామీ పనులన్నీ కేవలం ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణ కనుసన్నలలోనే నిర్వహిస్తున్నారని విమర్శించారు. అధికారులు దీనిపై స్పందించి తమకు న్యాయం చేయాలని, లేని పక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టి.ప్రసాద్, టి.ప్రేమ్‌కుమార్, ఎన్.రాజారావు, ఎన్.ఎర్రయ్య, ఇ.చిరంజీవి, ఎం.గంగారావు, ఎన్.శేషగిరి, ఎం.కృష్ణారావు, ఎస్.జయకృష్ణ, ఎన్.వాసు, టి.జోగారావు పాల్గొన్నారు.


పన్ను చెల్లిస్తున్న లలితాచౌదరి

ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీలో చాలా కాలంగా ఆస్తిపన్ను చెల్లించకుండా ఉన్న అసైన్‌మెంట్‌దారులకు పలు దఫాలుగా చర్చించడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయని, అందుకు ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అన్నారు. ఇందులో రాజ్యలక్ష్మి సమక్షంలో సాహుకారి లలితా చౌదరి బుధవారం ఆస్తి పన్ను చెల్లించారు. పన్ను వివరాలు అస్సెస్మెంట్ సౌత్ ఈస్టరన్ కారియర్స్ 2002-03/1 నుంచి ప్రస్తుత సంవత్సరం వరకు రూ.9,61,578 కాగా, వడ్డీ మాఫీ ద్వారా రూ.3,13,424 పన్ను చెల్లించారు. బుధవారం ఆస్తి పన్ను చెల్లింపులో భాగంగా రూ.9 లక్షలు వచ్చిందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ రమేష్, ఆర్ఐ అమర్, పొన్నాడ మహేష్ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న నాయకులు

గోవిందరావుకు సన్మానం

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని కింతలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయునిగా బుడుమూరు గోవిందరావు పనిచేసి ఇటీవల డెప్యుటేషన్‌పై ఐఇడి జిల్లా కో-ఆర్డినేటర్‌గా వెళ్లిన బుడుమూరు గోవిందరావుకు బుధవారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా విశాఖపట్నం కళా ఆస్పత్రి అధినేత, గ్రామానికి చెందిన డాక్టర్ పైడి వెంకటరమణ మాట్లాడుతూ ఐదున్నరేళ్లుగా పాఠశాలకు విశేషమైన సేవలను అందించారని, ఎంతోమంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా అభియాన్ ఎపిసి డాక్టర్ రోణంకి జయప్రకాష్, సర్పంచ్ పైడి రాంప్రసాద్, ఎంపిటిసి కూటికుప్పల హనుమంతరావు, ప్రధానోపాధ్యాయులు కె.ఎ.రాములు, పిఎంసి చైర్మన్ పి.రవికుమార్, మాజీ సర్పంచ్ దవల గణపతిరావు, పిఎసిఎస్ డైరెక్టర్ బొమ్మాళి శేషగిరి పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీల్లో అంతర్జాతీయ గుర్తింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

శ్రీకాకుళం మండలం ఒప్పంగి జిల్లా పరిషత్ విద్యార్థులు రంగోత్సవ సెలబ్రేషన్స్‌లో అంతర్జాతీయ గుర్తింపు సాధించారు. ముంబాయికి చెందిన ఓ సంస్థ నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కలరింగ్, చేతిరాత, కార్టూన్, గ్రీటింగ్ కార్డు తయారీలో విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచారు. పాఠశాలకు చెందిన బి.పూర్ణిమ కలరింగ్‌లో తృతీయ బహుమతి దక్కించుకోగా తొమ్మిదో తరగతి విద్యార్థి వరుణ్‌రాజ్, పదో తరగతి విద్యార్థిని ఎస్.నీరజ్‌కు ప్రత్యేక బహుమతులు వచ్చాయి. ఏడో తరగతి విద్యార్థులు ఎల్.భాగ్య, పి.కళ్యాణికి కన్సోలేషన్ బహుమతులు గెలుచుకున్నారు. మరో ఎనిమిది మంది విద్యార్థులకూ బహుమతులు వచ్చాయి. ప్రధానోపాధ్యాయుడు దాలినాయుడు విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందించారు. డ్రాయింగ్ టీచర్ టి.ప్రసాద్‌బాబును అందరూ అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న హెచ్‌ఎం దాలినాయుడు


లావేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

మహిళల ఆర్థికాభివృద్ధికి 'ఆసరా' దోహదం

ప్రజాశక్తి- లావేరు

మహిళల అభివృద్ధికి ఆసరా పథకం దోహదం చేస్తాయని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆసరా మూడో విడత సంబరాలను బుధవారం నిర్వహించారు. ముందుగా వైఎస్ఆర్ చిత్రపటానికి మహిళా సంఘాల సభ్యులతో కలిసి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలానికి సంబంధించి 1623 పొదుపు సంఘాల్లోని 17553 మంది లబ్ధిదారులకు రూ.18,16,687 నేరుగా వారి ఖాతాల్లోకి జమవుతాయని అన్నారు. అనంతరం నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో ఎంపిపి లుట్ట అమ్మాజమ్మ, ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, తహశీల్దార్ దిలీప్ చక్రవర్తి, ఎంపిడిఒ సురేష్, ఎపిఎం మాధవీలత, ఎపిఒ సత్యవతి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు చాంద్ బాష పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: ఆసరా పథకం మహిళాభివృద్ధికి దోహదపడుతుందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎంపిపి మేరుగు రాజేశ్వరి అధ్యక్షతన ఆసరా మూడో విడత లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. మండలంలో 1522 స్వయం సహాయక సంఘాల్లోని 16,640 మంది మహిళలకు రూ.10,59,20,065 నేరుగా మహిళల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి, టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి, సంతబొమ్మాళి పిఎసిఎస్ అధ్యక్షులు కెల్లి జగన్నాయకులు, మండల మహిళా కన్వీనర్ జోగి రాములమ్మ, వెలుగు సిసి ఎస్.శ్రీరాములు, ఎంపిడిఒ జి.ఉమాసుందరి, తహశీల్దార్ చలమయ్య, ఎంపిఎం ఎం.సూర్యనారాయణ పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని నామానపేటలో ఆసరా మూడో విడత నమూనా చెక్కును ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అందజేశారు. మండలంలోని 1093 డ్వాక్రా గ్రూపులకు రూ7,02,26,276లు ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి వాన గోపి, మండల కన్వీనర్ కనుసు సీతారాం, చల్లవానిపేట, అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులు పాగోటి రాజప్పల నాయుడు, పొన్నాన ముసలినాయుడు పాల్గొన్నారు.

కవిటి: మండలంలోని దుగానపుట్టుగలో సర్పంచ్ దుగాన భద్రాచలం ఆసరా మూడో విడతను పంపిణీ చేశారు. ముందుగా సిఎం జగన్ చిత్రపటానికి మహిళా సంఘాల సభ్యులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సిసి లక్ష్మి, విఒఎ మంజులత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కంచిలి : స్థానిక ఎఎంసి ప్రాంగణంలో మహిళా సంఘాల సభ్యులకు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు నమూనా చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయం, పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, జెడ్‌పిటిసి లోలాక్షి పాల్గొన్నారు.


కంచిలి : మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

వజ్రపుకొత్తూరు : మండలంలోని రెయ్యిపాడు, బాతుపురం, బైపల్లి, వజ్రపుకొత్తూరు గ్రామాల్లో ఆసరా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బచ్చల ధర్మారావు, మద్దిలి తిరుపతిరావు, పొదుపు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం


శ్రీకాకుళం అర్బన్ : ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అప్పలసూర్యనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తెలుగువారి కీర్తిని నలుదిశలా వ్యాపించేలా టిడిపి గడచిన నాలుగు దశాబ్దాలుగా కృషి చేస్తుందని, పేద సంక్షేమానికి ఎన్‌టి రామారావు టిడిపిని స్థాపించారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఎన్‌టిఆర్ అడుగుజాడల్లో చంద్రబాబు పార్టీ ఆశయాలకు అనుగుణంగా ప్రజారంజక పాలన సాగిస్తూ రాష్ట్రాభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, ఉపాధ్యక్షులు పి.ఎం.జె.బాబు, చిట్టి మోహన్, శిల్లా శ్రీనివాస్, గండేపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నగరంలోని విశాఖ ఎ కాలనీలోని సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ తన కార్యాలయంలో టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ముందుగా సూర్యమహల్, ఏడురోడ్ల కూడలి, టిడిపి జిల్లా కార్యాలయంలోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మూకళ్ల శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, గార మాజీ ఎంపిపి గుండ భాస్కరరావు పాల్గొన్నారు.

సోంపేట: టిడిపి ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ఎమ్మెల్యే బెందాళం అశోక్ కవిటీలో చేపట్టిన భారీ బైక్ ర్యాలీ సోంపేట చేరింది. సోంపేట ఆరోగ్య వరం వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

ఇచ్ఛాపురం : టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక బస్టాండ్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి నాయకులు కాళ్ల ధర్మారావు, నందిక జాని, కాళ్ల జయదేవ్, లోపింటి పద్మనాభం, జిలానీ, నందిగామ కోటేశ్వరరావు, జానకిరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

సరుబుజ్జిలి : టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సరుబుజ్జిలిలో టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎండ రామారావు, కొమనాపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

కవిటి: టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని రామయ్యపుట్టుగలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి కవిటి బస్టాండ్ కూడలిలోని ఎన్‌టిసి విగ్రహం వద్దకు చేరుకున్నారు. అనంతరం ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. జగతి, బెజ్జిపుట్టుగ, బొరివంక, లోళ్ళపుట్టుగ, కుసుంపురం, మాణిక్యపురం గ్రామాల మీదుగా సోంపేట బైక్ ర్యాలీ నిర్వహించారు.


కోటబొమ్మాళి : విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రమేష్

సంతబొమ్మాళి : సంతబొమ్మాళిలో టిడిపి నాయకులు జీరు భీమారావు, రెడ్డి అప్పన్న, కూచెట్టి కాంతారావు, దుపాన రవాణారెడ్డి, పరపటి రాజశేఖర్‌రెడ్డి, కుచెట్టి భానుప్రకాష్, బెండి అరుణ్ కుమార్‌లు జెండాను ఎగురవేశారు.

పోలాకి : మార్కెట్‌లో టిడిపి జెండాను నాయకులు గొండు రామన్న, కిల్లి వేణు, ఎం.వెంకట అప్పలనాయుడు, భైరి భాస్కరరావు, ఎల్.రాంబాబు, డోల ప్రసాదరావు, ఎం.త్రినాథరావు ఆవిష్కరించారు.

లావేరు : లావేరులోని ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, దారపురెడ్డి కూర్మారావు, మాకన శంకరరావు, లంకలపల్లి శ్రీనివాసరావు, ఆనందరావు, జగన్నదొర, పోతురెడ్డి వెంకన్న మురళి, ఆర్.తాతారావులు ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.

పొందూరు: మహారాజా మార్కెట్‌లో టిడిపి జెండాను మండల అధ్యక్షుడు రామ్మోహన్, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కరరావు, మండల ఉపాధ్యక్షుడు బాడన శేషగిరినాయుడు, ప్రధాన కార్యదర్శి మురళి, పట్టణ పార్టీ అధ్యక్షుడు రంగ తదితరులు ఆవిష్కరించారు. అనంతరం కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

పలాస : స్థానిక టిడిపి కార్యాలయం ఆవరణలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వజ్జ బాబూరావు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గురిటి సూర్యనారాయణ గాలి కృష్ణారావు, నాగరాజు, నవీన్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : పట్టణంలోని పారిశ్రామిక వాడ వద్ద ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యాలయ సమన్వయ కార్యదర్శి మొదలవలస రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు, సనపల ఢిల్లేశ్వరరావు, తమ్మినేని విద్యాసాగర్, సంపదరావు మురళి పాల్గొన్నారు.

బూర్జ : బూర్జని టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు వి.రాంజీనాయుడు, తుడ్డలి సర్పంచ్ అంపిలి గణపతిరావు, మజ్జి శ్రీరాములునాయుడు, లంక జగన్నాథంనాయుడు, కడగల కృష్ణ, హనుమంతు గోపి, రాంబాబులు కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం జల్లు పోలినాయుడుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.


పొందూరు : కేక్‌ను కట్ చేస్తున్న టిడిపి నాయకులు


కవిటి : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

కోటబొమ్మాళి: టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానికంగా ఉన్న ఎన్‌టిఆర్, ఎర్రన్నాయుడు విగ్రహాలకు టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, తర్ర రామకృష్ణ, వెలమల కామేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గ మహిళ అధ్యక్షులు పూజారి శైలజ, గొండు లక్ష్మణరావు, కోట సంతోష్ తదితరులు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కోటబొమ్మాళికి చెందిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి : టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మెళియాపుట్టిలోని ఎన్‌టిఆర్ విగ్రహానికి మండల అధ్యక్షులు భాస్కర్‌గౌడ, జిల్లా మహిళా ఉపాధ్యక్షులు బూర్ల లలితకుమారి, ప్రధాన కార్యదర్శి ఉల్లాన వసంత్, లక్ష్మణరావు, భాస్కరరావు, పడాల శ్రీను, మాలతి శ్రీధర్‌లు పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.

టెక్కలి : టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా టిడిపి కార్యాలయంలో మండల అధ్యక్షులు బగాది శేషగిరి కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, రెయ్యి ప్రీతీష్‌చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, మెండ దమయంతి, కోళ్ల లవకుమార్, మల్లిపెద్ది మధు, కోళ్ల కామేష్, ఇప్పిలి జగదీష్, పేర మురళి పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న సాంబమూర్తి

కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

కుష్టు వ్యాధిగ్రస్తులను ముందుగా గుర్తించి వారికి సకాలంలో మందులను అందజేస్తే వ్యాధిని అరికట్టవచ్చని పారామెడికల్ జిల్లా ఆఫీసర్ టి.సాంబమూర్తి అన్నారు. పట్టణంలోని మోణింగివారివీధి, మెట్టక్కివలసలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్లను బుధవారం సందర్శించారు. 11 సచివాలయాల పరిధిలోని 54 మంది అనుమానిత కుష్టు లక్షణాలు ఉన్న రోగులను తనిఖీ చేశారు. అనంతరం ఎఎన్ఎం, ఆశావర్కర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చర్మంపై గోధుమ రంగులో మొద్దు బారిన స్పర్శ లేని మచ్చలు ఏర్పడతాయని, అలాగే తిమ్మిరితో కూడిన మచ్చలు, పాలిపోయిన మచ్చలు ఉంటాయని, ఇవి కనిపిస్తే ప్రాథమిక లక్షణాలుగా గుర్తించాలని అన్నారు. అటువంటి వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రిఫర్ చేయాలని సూచించారు. ఇంటింటా సర్వే చేసి రోగులను గుర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ ఫార్మసిస్టు చింతాడ వరుణ్ కుమార్, స్టాఫ్‌నర్స్ ఫాల్గుణరావు, ల్యాబ్ టెక్నీషియన్ ఉపేంద్ర, డేటా ఎంట్రీ ఆపరేటర్ హేమంత్, ఎల్‌జిఎస్ రమేష్ పాల్గొన్నారు.

'స్వచ్ఛ ఉత్సవ్' ర్యాలీ

ఇచ్ఛాపురం : స్వచ్ఛ ఉత్సవ్‌లో భాగంగా జీరో వేస్ట్ డే సందర్భంగా ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, కమిషనర్ రమేష్ ఆధ్వర్యాన బుధవారం స్వచ్ఛతా మషాల్ మార్చ్ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ మున్సిపల్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ కూడలి వరకూ సాగింది. ఇందులో భాగంగా స్వయంశక్తి సంఘాల సభ్యులతో, మహిళా వార్డు వాలంటీర్లతో స్వచ్ఛ ఉత్సవ్ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు లాభాల స్వర్ణమణి, ఉలాల భారతిదివ్య, కౌన్సిలర్ తాడి ఆదిరెడ్డి, బచ్చు జగన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫకీరు రాజు, ఉపేంద్రకుమార్, సిఎంఎం జానకిరావు పాల్గొన్నారు.



వయోవృద్ధుల హక్కుల పరిరక్షణే ధ్యేయం

సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి- టెక్కలి టౌన్

వయోవృద్ధులకు హక్కులు కల్పించే విషయంలో ప్రభుత్వం పూర్తిగా అండగా నిలబడుతుందని సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యాన తొలిసారిగా డివిజన్ స్థాయి వయోవృద్ధుల, తల్లిదండ్రుల నిర్వహణ పోషణ చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వయోవృద్ధుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చట్టం ద్వారా కృషి చేస్తుందన్నారు. వయోవృద్ధులకు ప్రభుత్వం అందించే పథకాలను చట్టంలో పొందుపరిచినట్లుగా హక్కులపై అవగాహన పెంపొందించుకుని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వృద్ధాశ్రమంలోని వయోవృద్ధులకు ఇలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలకు బాల్యం నుంచే మానవ విలువలపై, పెద్దలపై గౌరవం పెంపొందించుకునే విధంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం సార్ ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నంబరు 14567 పోస్టర్‌ను ప్రారంభించారు. సమావేశంలో జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు కిరణ్‌కుమార్, ఫీల్డ్ అధికారి తిరుపతిరావు, తహశీల్దార్, ఎస్ఐ పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

కవిటిలో డిగ్రీ కాలేజ్ ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

కవిటి మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని సీడ్ ఎపి చైర్మన్ సాధి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి కోరారు. ఈ మేరకు అమరావతిలోని కాలేజీ కమిషనర్ పోలా భాస్కర్‌కు బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కవిటి మండలంలో 10,0286 జనాభా, 23 పంచాయతీలు, 200లకు పైగా గ్రామాలు ఉన్నాయని పేర్కొన్నారు. కవిటి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో నిరుపేద విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అనానరు. ఇచ్ఛాపురం, బారువ ప్రాంతాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయని, కవిటి మండలంలోని మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు వెళ్లాలంటే రానూ పోనూ 35-40 కిలోమీటర్లు ఉంటుందని అన్నారు. సరైన రోడ్డు, బస్సు సౌకర్యాలు లేకపోవడంతో అంతదూరం ప్రయాణం చేయలేక కవిటి ప్రాంతంలోని ప్రయివేట్ కాలేజీల్లో చదువులు కొనసాగిస్తున్నారని అన్నారు. దీంతో పేద విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ప్రయివేట్ విద్యా సంస్థల్లో ఫీజులు కట్టలేక, పై చదువులు లేక మధ్యలోనే చదువులను ఆపివేస్తున్నారని వివరించారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలలో చుట్టు పక్కల ప్రాంతాల అనేక మంది విద్యార్థులు చదువుతున్నారని, డిగ్రీ కళాశాల ఉంటే ఆ విద్యార్థులే అక్కడే డిగ్రీ కూడా చదువుతారని అన్నారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించారని శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు.


వినతిపత్రం అందజేస్తున్న శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి

మున్సిపాలిటీ ఉపాధ్యాయుల హర్షం

ఇచ్ఛాపురం : పురపాలక ఉపాధ్యాయులు ఆశగా ఎదురుచూస్తున్న సర్వీస్ రూల్స్ డ్రాఫ్ట్‌ను ప్రభుత్వం విడుదల చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయ సంఘాల జెఎసి ఆధ్వర్యాన బుధవారం సమావేశం నిర్వహించారు. ఏ ప్రభుత్వమూ తమను పట్టించుకోవడం లేదన్న నిరాశలో ఉన్న పురపాలక ఉపాధ్యాయులకు ప్రభుత్వం తీపి కబురు అందించిందని అన్నారు. ఈ ఉమ్మడి సర్వీస్ నియమాలు అమలు చేస్తే అందరికీ బదిలీలకు, ఉద్యోగోన్నతులకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ధర్మాన భాస్కరరావు, సిద్ధాంతి, వల్లభరావు, గగణకుమారి, విజయ, సత్యనారాయణ, శంకర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సంక్షేమానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

న్యాయవాదుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నానని జిల్లా బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు, ప్రస్తుతం బార్ అసోషియేషన్ అధ్యక్ష పదవి రేసులో ఉన్న డాక్టర్ ఎన్ని సూర్యారావు పేర్కొన్నారు. నగరంలోని ఓ ప్రయివేటు హోటల్‌లో బుధవారం విలేకరులతో మాట్లాడారు. న్యాయవాదులంతా తమ విజ్ఞతతో గతంలో తాను చేసిన సేవలు గుర్తించి మరోసారి జిల్లా బార్ అసోషియేషన్ అధ్యక్షునిగా ఎన్నుకోవాలని కోరారు. గతంలో పని చేసిన అనుభవంతో న్యాయవాదుల సమస్యలపై అవగాహన ఉందని, న్యాయవాదులంతా ఈ విషయాన్ని గమనించి ఈ నెల 31న జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోషియేషన్ హాల్‌లో నిర్వహించనున్న ఎన్నికల్లో సభ్యులు తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ఎపి బిసి అడ్వకేట్ అసోషియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆగూరు ఉమామహేశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సూర్యారావు


సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు

ఒబిఇపై 'ఐతమ్'లో సదస్సు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఔట్ కమ్ బేస్ ఎడ్యుకేషన్ విధానంపై ఐతమ్ ఐక్యూఎసి, విద్యాంజలి విభాగాల ఆధ్వర్యాన బుధవారం అధ్యాపకులకు ఆన్‌లైన్ ద్వారా సదస్సు నిర్వహించామని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. పశ్చిమ బెంగాలకు చెందిన హుబ్లీ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌగత్ సమంత ముఖ్యవక్తగా మాట్లాడుతూ ఎఐసిటిఇ ఆదేశం మేరకు నిర్వహించే ఒబిఈ విధానం వల్ల విద్యార్థికి కలిగే ప్రయోజనాలు, పాఠ్యాంశాల బోధన, నైపుణ్యాభివృద్ధి, ఒబిఇ లక్ష్యాలు, ఆవస్యకత, అమలు తీరుపై వివరించారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, ఐక్యూఎసి డీన్ డాక్టర్ సిహెచ్.రమేష్, డీన్లు, హెచ్చోడిలు, అధ్యాపకులు, నోడల్ ఆఫీసర్ ఎస్.భాస్కరబాబులు, సదస్సు కన్వీనర్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి- రణస్థలం

పంచాయతీ ప్రధాన కేంద్రాల వద్ద ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ధనుంజయరావు కోరారు. మండలంలోని సంచాం పంచాయతీలో బుధవారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు మండల వ్యాప్తంగా అన్ని పంచాయతీల ప్రధాన కూడళ్లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రోజురోజుకూ ఎండలు తీవ్రమవుతున్న తరుణంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి రాము, కార్యదర్శి హైదర్ ఆలీ బేగ్, వైసిపి నాయకులు పతివాడ అప్పలనాయుడు, రెడ్డి ఆనంద్, మీసాల రాము, కెల్ల శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుపై అవగాహన


మాట్లాడుతున్న ప్రసాదరావు

శ్రీకాకుళం అర్బన్ : రైతులు ఉద్యాన పంటల సాగుపై అవగాహన కలిగి ఉన్నప్పుడే మంచి దిగుబడులు సాధించవచ్చని జిల్లా ఉద్యాన శాకాధికారి ఆర్.వి.వి.ప్రసాదరావు అన్నారు. నైర వ్యవసాయ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యాన జాతీయ సేవా కార్యక్రమంలో భాగంగా అలికాలంలో బుధవారం ఉద్యాన పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కళాశాల డీన్ డాక్టర్ డి.శ్రీనివాస్ మాట్లాడుతూ వాణిజ్య పంటల్లో మేలు జాతి వంగడాలను వినియోగించడం ద్వారా చీడపీడల బారిన పడకుండా తగిన దిగుబడులు సాధించవచ్చన్నారు. అధిక దిగుబడులకు మేలైన యాజమాన్య పద్ధతులు అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ఉద్యాన విభాగం అధ్యాపకులు డాక్టర్ ఎం.లక్ష్మీదుర్గ తీగజాతి కూరగాయలు యాజమాన్య పద్ధతులు, పోషకాహార విలువలపై వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జి.ఎస్.రాయ్, డాక్టర్ శ్రీసంధ్య, అలికాం సర్పంచ్ రంధి అప్పలస్వామి, ఎంపిటిసి నాగేశ్వరరావు, విఎఎ లావణ్య పాల్గొన్నారు.


యంత్ర సాయంతో కొబ్బరి చెట్టు ఎక్కుతున్న రైతు

కొబ్బరి వృత్తిపై శిక్షణ

ఆమదాలవలస : పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఫ్రెండ్స్ ఆఫ్ కోకోనెట్ ట్రీ అనే కార్యక్రమంపై కొబ్బరి అభివృద్ధి బోర్డు భారత ప్రభుత్వం ఆర్థిక సౌజన్యంతో ఆరు రోజుల పాటు శిక్షణ యువ రైతుల కోసం ఇస్తున్నామని కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు పనిమిట్ల వినియోగంపై బుధవారం అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా ఉద్యానవన అధికారి ఆర్.వి.వి.ప్రసాద్ మాట్లాడుతూ రైతులకు కొబ్బరి పంట వల్ల కలిగే ప్రయోజనాలు జిల్లాలో సాగుతున్న కొబ్బరి విస్తీర్ణం తదితర అంశాలను వివరించారు. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం కొబ్బరి కోత సులభతరం చేయడానికి కేరళ కొబ్బరి బోర్డు నుంచి చెట్లు ఎక్కే పనిముట్లను తెచ్చి యువ రైతులకు శిక్షణను ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యానవన శాస్త్రవేత్త డాక్టర్ వి.హరి కుమార్ మాట్లాడుతూ కొబ్బరి రకాలు, సాగు, యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నేలవేణి, డాక్టర్ ఎ.అనూష, డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, మాస్టర్ ట్రైనర్స్ రఘు, శ్రీను పాల్గొన్నారు.

వేలంపాటలు వాయిదా

పొందూరు: మేజరు పంచాయతీకి సంబంధించి మార్కెట్, కబేళా తదితర విషయాలకు సంబంధించి బుధవారం నిర్వహించాల్సిన వేలం పాటలను ఈ నెల 31కు వాయిదా వేస్తున్నట్లు మేజరు పంచాయతీ కార్యదర్శి ఎస్.రమేష్ తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరావత్తులు రాని కారణంగా వాయిదా వేస్తున్నామని, వేలంపాటలో పాల్గొనాల్సిన వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు పంచాయితీ కార్యాలయంలో హాజరు కావాలని కోరారు.

బార్ అసోసియేషన్ ఎన్నిక ఏకగ్రీవం

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా అర్.దేవరాజురెడ్డి, కార్యదర్శిగా ఎన్.సి.సాహు, కోశాధికారిగా హేమలతాదేవిలు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి బార్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

నాయీబ్రాహ్మణుల హర్షం

కోటబొమ్మాళి: అనంతరంపురంలో యువగళం పాదయాత్రలో నాయీబ్రహ్మణలకు టిడిపి జాతీయ అధ్యక్షులు నారా లోకేష్ వరాల జల్లు కురిపించడం హర్షణీయమని నాయీబ్రహ్మణుల జిల్లా ఉపాధ్యక్షులు నౌగాపు నాగరాజు అన్నారు. ఈ మేరు బుధవారం విలేకరులతో మాట్లాడారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే నాయీబ్రహ్మణులకు ఒక ఎమ్మెల్సీ, బిసి కార్పొరేషన్ ద్వారా ప్రత్యేక నిధులు, ప్రమాద బీమా కింద రూ.పది లక్షలు వర్తించే విధంగా హామీనివ్వడం హర్షణీయమన్నారు. కన్వీనర్ వెంకటరావు, సూర్యనారాయణ ఉన్నారు.


మాట్లాడుతున్న సంఘ సభ్యులు

రైతు శ్రేయస్సుకు పాటుపడాలి

ప్రజాశక్తి- కవిటి

పార్టీలకతీతంగా పనిచేసి రైతు శ్రేయస్సుకు పాటుపడాలని ఇచ్ఛాపురం నియోజకవర్గం రైతు కులం సంఘ సభ్యులు కోరారు. స్థానిక చింతామణి అమ్మవారి ప్రాంగణంలో బుధవారం రైతు కులం సంఘ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఉద్దానం ప్రధాన సమస్యలైన గొణామరిగడ్డ, బీలబట్టి, కొబ్బరి ప్లాంట్ తదితర అంశాలపై ప్రభుత్వాలు ఎంతవేగం స్పందిస్తే రైతులకు అంత మేలు చేకూరుతుందన్నారు. ఇటీవల కాలంలో ధాన్యం సేకరణలో రైతులు అనేక ఇబ్బందులకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి సమస్యలు రాకుండా చూడాలని కోరారు. రైతు కులం సంఘం తరుపున పూర్తిస్థాయిలో మండల కమిటీలు ఏర్పాటు చేసి రైతుల సమస్యలపై పోరాడాలని సభ్యులు తీర్మానించారు. సమావేశంలో జన్నెల ప్రసాదరావు, మాదిన రామారావు, దేవరాజ్‌సాహు, బెందాళం రమేష్, బబ్లు అగర్వాల్, దట్టి అజయ్, బి కామేష్ రెడ్డి, ఆరింగి రాజు, మొగిలిపురి సింహాచలం, శ్యామ్ తదితరులు హాజరయ్యారు.

75 మందికి వైద్య పరీక్షలు

ఇచ్ఛాపురం : మండలంలోని పురుషోత్తపురం ఉన్న పాఠశాలలో శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రి వైద్యులు బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మేరకు వైద్యాధికారులు కె.సిద్ధార్థ, డాక్టర్ మోనికలు 75 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమంగా మందులు తీసుకోవాలని సూచించారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుగ్గు ప్రేమ్‌కుమార్, కౌన్సెలర్ ప్రతినిధి చాట్ల తిరుపతి, సంతోష, శ్రీధర్ పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి- రణస్థలం

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసి వాటరు ట్యాంకు నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలో పాతర్లపల్లిలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ నిధుల నుంచి అంచనా విలువ రూ. 57 లక్షలతో 120 కిలో లీటర్ల కెపాసిటీతో మంజూరైన వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాం, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ అధికారులు పి.బంగారయ్యశెట్టి, బి.రవికుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సూర్యనారాయణ, ఎఒ రామారావు పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్


టిబి ముక్త భారత్‌కు సీనియర్ సిటిజన్ల సాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

క్షయ రోగులకు పౌష్టికాహారం అందించాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ కార్యక్రమానికి నగరంలోని సీనియర్ సిటిజన్ల అసోసియేషన్ రూ.1,05,000 ఆర్థికసాయాన్ని అందజేశారు. నగరంలోని రెడ్‌క్రాస్ కార్యాలయంలో చైర్మన్ పి.జగన్మోహనరావును బుధవారం కలిసి చెక్కును అందించారు. ఈ సాయంతో క్షయవ్యాధిగ్రస్తులకు ఆరు నెలల పాటు ఒక్కొక్కరికీ రూ.4,200 విలువైన పౌష్టికాహారం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు బి.మల్లేశ్వరరావు, సభ్యులు కె.సోమసుందరరావు, పి.నరసింహమూర్తి, ఎంఎస్.ఆర్.ఎస్.ప్రకాశరావు, పి.ఎస్.ప్రసాదరావు, బి.చిన్మయరావు, వి.ఎం.రావు, పి.చైతన్య పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న సీనియర్ సిటిజన్లు

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్-23లో పాతటెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి లమ్మత అఖిల్ సాయి, వంక మౌనిక, కోడ ధనలక్ష్మి ఎంపికయ్యారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు గ్రామస్తులు, ప్రధానోపాధ్యాయులు పద్మనాభరావులు బుధవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి పోటీ పరీక్షల్లోనూ పాల్గొవాలని కోరారు. గైడ్ టీచర్లు, ఇతర ఉపాధ్యాయులు కృషి వల్ల విద్యార్థులు ఉపకార వేతనాలకు ఎంపికయ్యారని తెలిపారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి- నందిగాం

నేటి బాలలు రేపటి పౌరులు అని, నవ సమాజ నిర్మాణానికి నిర్దేశికులుగా ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అన్నారు. నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుకు ప్రాధాన్యత ఇచ్చి ఉన్నస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం సినీ గీతాలకు డాన్సులు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై.హరిబాబు, సర్పంచ్ ప్రతినిధి జె.జయరాం, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమణమూర్తి పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని చీమలవలస మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థుల ఘనంగా ఫ్రెషర్స్ డేను నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఇఒ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై దృష్టి పెట్టి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక, సినీ పాటలకు నృత్యాలను వేసి అందరినీ అలరించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు గురుగుబెల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ సనపల చెల్లంనాయుడు, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ యు.రామారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వి.రమణ, బి.గోవిందరావు, సిఆర్‌పి బొడ్డేపల్లి నర్సింగరావు పాల్గొన్నారు.


ఆమదాలవలస : మాట్లాడుతున్న ఎంఇఒ రామారావు